
సాక్షి
ఒడిశా
శనివారం। 23। ఆగస్టు। 2025



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు
నగదు : రూ. 3,69,972
బంగారం : 240 మిల్లీ గ్రాములు
వెండి : 2 గ్రాముల 350 మిల్లీ గ్రాములు
- భువనేశ్వర్/పూరీ



నేడు సప్తపురి అమావాస్య

శ్రీమందిరంలో సప్తపురి అమావాస్య నిర్వహించారు. పూజాదులు నిర్వహించారు.
- 8లో



విద్యావ్యవస్థల విలీనం

బీఎస్ఈ, సీహెచ్ఎస్ఈ విలీనం కాబోతున్నాయి. ఈ మేరకు సీఎం ప్రకటించారు.
- 8లో

పూరీలో యాత్ర రథాల.. విచ్ఛేదనం ప్రారంభం

• అధునాతన గోదాం సిద్ధం

భువనేశ్వర్: పూరీలో శుక్రవారం నుంచి స్వామి యాత్ర రథాల విచ్ఛేదనం పనులు ప్రారంభమయ్యాయి. తయారీ ప్రక్రియలో అమరిక క్రమంలో విచ్ఛేదన ప్రక్రియలో 3 రథాల్లో భాగాల్ని జాగ్రత్తగా విడదీస్తారు. ఈ విడి భాగాల్లో ప్రముఖమైన వాటిని ఔత్సాహికులకు వేలం ద్వారా విక్రయిస్తారు. ఈ ఏడాది నుంచి అత్యంత పవిత్రంగా భావించే రథాల భాగాల్ని ప్రత్యేక గోదాంలో భద్రపరచనున్నారు. చివరగా మిగిలిన కలప చెక్కల్ని శ్రీ మందిరంలో ప్రసాదాల తయారీ వంట చెరుకుగా వినియోగిస్తారు. ఇలా రథాల్లో ఏ ఒక్క చెక్క ముక్కని వృథా చేయకుండా సర్వం స్వామి సేవలో విలీనం చేయడం అత్యద్భుత సంస్కృతి.

శ్రీ మందిరం అధికార వర్గాల ఆదేశాల మేరకు శుక్రవారం నుంచి రథాల భాగాల్ని విడదీసే పనులు ప్రారంభించాయి. సర్దార్ భొయి సేవకుని ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ పనులు కొనసాగుతున్నాయి. సంప్రదాయం ప్రకారం తొలుత దేవీ సుభద్ర రథం దర్ప దళనం భాగాల్ని విడదీస్తున్నారు. తర్వాత బలభద్ర స్వామి తాళ ధ్వజం చివరగా శ్రీ జగన్నాథుని నందిఘోష్ రథాన్ని విడదీయడం ఆచారం. రథ చక్రాలు, ప్రభలు, తలుపు ఫ్రేములు, పార్శ్వ స్తంభాల భాగాల్ని శ్రీ మందిరం పాలక వర్గం వేలం వేస్తుంది. ఈ మేరకు ఔత్సాహిక వర్గాలకు అనుబంధ సమాచారం ముందస్తుగా ప్రసారం చేసింది.

రథాల విచ్ఛేదన పవిత్ర కార్యం

అత్యంత నియమ నిష్ఠలతో జగతి నాథుని యాత్ర కోసం నింగిని తాకే 3 భారీ రథాలు ఏటా తయారు చేస్తారు. ఈ మేరకు అడుగడుగునా ఆచార సంప్రదాయాలతో కూడిన పూజాదులు ఇతరేతర పవిత్ర కార్యకలాపాలతో రథాల తయారీ పూర్తి చేస్తారు. స్వామి ఆశీనుడై యాత్ర చేయడంతో ఈ రథాలు మరింత పవిత్రత సంతరించుకుంటాయి.



రథాల విడి భాగాల భద్రత కోసం సిద్ధం అవుతున్న అధునాతన సౌకర్యాల గోదాం



సుభద్ర రథం దర్ప దళనం కూల్చివేత

వాటి విచ్ఛేదన కూడ అంతే పవిత్రంగా నిర్వహించడం జరుగుతుందని మరో మరో సేవాయత్ తెలిపారు. ముందుగా ఆచారం ప్రకారం ప్రత్యేక పూజాదులతో రథాల భాగాల విడదీత ప్రారంభించడం జరుగుతుందన్నారు. రథాలను పై నుండి విచ్ఛేదనం చేస్తారు. ఒక్కో రథం భాగాలుగా విడదీయడంలో దాదాపు 10 మంది సేవాయత్‌లు పాల్గొంటారు.

పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు

3 భారీ నిలువెత్తు రథాల భాగాల విడదీత పురస్కరించుకుని అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా జాగ్రత్త వహిస్తున్నారు. భారీ చెక్క నిర్మాణాలను కూల్చివేస్తున్నందున ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండటానికి ఆ ప్రదేశం చుట్టూ భద్రతా దళాలను మోహరించారు. ప్రత్యేక భద్రతా మార్గదర్శకాలతో ఈ బృహత్తర కార్యక్రమం చేపట్టారు. ప్రతి రథం శిఖర భాగం నుంచి భాగాలవారీగా విడదీయడం క్రమ పద్ధతిగా భొయి సేవకుల వర్గం పేర్కొంది. ఈ ఏడాది రథాల భాగాల విడదీత పనులు స్వల్ప ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. రథాల నుంచి విడదీసిన ప్రధాన భాగాల్ని భద్రపరిచేందుకు ప్రత్యేక గోదాం తయారీ నేపథ్యంలో ఈ జాప్యం అనివార్యమైందని భొయి సర్దారు తెలిపారు. గోదాం నిర్మాణం దాదాపు తుది దశకు చేరడంతో దేవీ సుభద్ర దర్ప దళనం, బలభద్ర స్వామి తాళ ధ్వజం మరియు శ్రీ జగన్నాథుని నందిఘోష్ రథం భాగాలు విడదీయడం ప్రారంభించారు.

సిద్ధం అవుతున్న అధునాతన గోదాం

కూల్చివేసిన రథాల విడి భాగాలను నిల్వ చేయడానికి మసాని చండి సాహిలో శాశ్వత గోదాం నిర్మించామని శ్రీమందిర్ భద్రతా వర్గం అధికారులు తెలిపారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఆధునిక గోదాంలో నందిఘోష్, తాళ ధ్వజం దర్ప దళనం పవిత్ర రథాల విడి భాగాలను నిల్వ చేస్తారు. అబఢా పథకం కింద ఈ గోదాం నిర్మాణం చేపట్టారు. ఈ సముదాయంలో గోదాం అనుబంధ సిబ్బంది క్వార్టర్స్ నిర్మాణం దాదాపు పూర్తయ్యే దశలో ఉంది. గోదాంలో రథాల విడి భాగాల పవిత్రత లోపించకుండా పర్యవేక్షించేందుకు సంప్రదాయబద్ధంగా సేవ చేసే సిబ్బందికి మెరుగైన సౌకర్యాలతో కూడిన వసతి సముదాయం సిద్ధం అవుతుంది.

శ్రీమందిరం ఎక్కేందుకు యత్నం

• అదుపులోకి తీసుకున్న పోలీసులు

భువనేశ్వర్: పూరీ శ్రీజగన్నాథ ఆలయం శిఖరం పైకి ఎక్కేందుకు యత్నించిన వ్యక్తిని ఆలయ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. దీంతో శ్రీమందిరం భద్రతా ఏర్పాట్లపై పలు ప్రశ్నలు తలెత్తి చర్చనీయాంశం అయ్యాయి. శ్రీమందిరం సముదాయంలో నృసింహ స్వామి మందిరం సమీప పశ్చిమ ద్వారం వద్ద ఈ ఘటన జరిగింది. నిందితుడు ఉత్తరప్రదేశ్ అజంగఢ్ జిల్లాకు చెందిన మనోజ్ సింగ్‌గా గుర్తించారు. అతడు నృసింహ మందిరం వైపు నుంచి ఆలయం శిఖరం పైకి ఎక్కేందుకు ప్రయత్నించాడు. సకాలంలో అప్రమత్తమైన భద్రతా సిబ్బంది అతడి ప్రయత్నం అడ్డుకుని సురక్షితంగా కిందకు దించారు. వెంటనే అదుపులోకి తీసుకుని తదుపరి విచారణ కోసం శ్రీమందిరం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ఇటీవల తరచూ ఘటనలు..

ఇటీవల కాలంలో శ్రీమందిరంలో ఇటువంటి ఘటనలు తరచూ చోటుచేసుకోవడం కలవరపరుస్తున్నాయి. ఈ ఘటనలతో శ్రీమందిరం భద్రతా వ్యవస్థ పటిష్టతపై సర్వత్రా ఆందోళన వ్యక్తం అవుతుంది. ఇటీవలే రాంచీకి చెందిన ఒక భక్తుడు దక్షిణి ఘరా (దక్షిణ ద్వారం వైపు) సమీపంలో ఉన్న మందిరం ప్రాంగణం నుంచి పైకి ఎక్కడానికి ప్రయత్నించినప్పుడు పట్టుబడ్డాడు. అదేవిధంగా గంజాం జిల్లాకు చెందిన మరో భక్తుడు ఆలయ బయటి గోడలను ఎక్కేందుకు ప్రయత్నిస్తుండగా పట్టుబడ్డాడు. పదేపదే ఇటువంటి ఘటనలు జరుగుతుండడంతో పవిత్ర శ్రీక్షేత్రం భద్రతపై ఆందోళన రేకెత్తుతోంది. వీటి నివారణ చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తరచూ హామీ ఇస్తున్నారు. అటువంటి ప్రయత్నాలను ఆపడానికి ఏకాదశి మందిర్ మరియు దక్షిణి ఘెురా సమీపంలో ఇటీవల బారికేడ్లను నిర్మించినట్లు పూరీ జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ ప్రకటించారు. అయితే తాజా సంఘటనతో ఈ చర్యలు చొరబాటు ప్రయత్నాలను నివారించడంలో అక్కరకు రావడం లేదని స్పష్టం అయింది. ప్రస్తుత భద్రతా ఏర్పాట్ల పటిష్టతపై అనుబంధ యంత్రాంగం ప్రత్యేకంగా దృష్టి సారించాల్సి ఉంది.



మనోజ్ సింగ్

మహేంద్రగిరి బహుముఖ ఆగ్రో సంస్థపై గిరిజనుల ఆరోపణ



ఆదర్శ పోలీసు స్టేషన్ ఎదుట గుమ్మా, కాశీనగర్ గిరిజన గ్రామాల ప్రజలు

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో గుమ్మా, కాశీనగర్ సమితిల్లో అనేక మంది ఆదివాసీ ప్రజల వద్ద నుంచి మహేంద్రగిరి బహుముఖ ఆగ్రో ప్రోడక్టు సంస్థ రైతులకు స్వయం ఉపాధి కల్పిస్తామని, వివిధ ఆగ్రో ప్రోడక్ట్సు, మేలైన మొక్కలు అందజేస్తామని చెప్పి రూ.20 లక్షలు వసూలు చేసిందని ఆరోపిస్తూ గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై ఒక గిరిజన గ్రామాల ప్రజలు ఆదర్శ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రాణిపేట గ్రామానికి చెందిన మహేంద్రగిరి మల్టిపర్పస్ ఆగ్రో ప్రొడక్ట్ సంస్థ చైర్మన్ ప్రదీప్ కుమార్, తన ప్రతినిధులను గిరిజన గ్రామాల్లో నియమించి వారికి మేలైన పండ్ల మొక్కలు ఇస్తామని అనేక మందికి ఎంజీఎంపీసీలో సభ్యత్వం నమోదు చేశారు. దీనిపై ఆదర్శ పోలీసు స్టేషన్ అధికారి ప్రశాంత భూపతిని వివరణ కోరగా.. మహేంద్రగిరి మల్టీపర్పస్ ఆగ్రో ప్రొడక్ట్సు సంస్థ రిజిస్టర్డు బాడీ అని, సంస్థ చైర్మన్ ప్రదీప్ కుమార్ గిరిజనులకు మోసం చేయలేదని, సంస్థలో పెట్టుబడి పెట్టే గిరిజన రైతులకు మోసం చేయబోమని, వారి సంస్థ నమ్మకం కలిగించడానికి.. గుమ్మ,కాశీనగర్ సమితుల్లో ఉన్న అనేక రిజన గ్రామాల్లో సభ్యులను సమావేశ పరిచి సందేహాలను నివృత్తి చేస్తామని ఆయన చెప్పాడని ఐఐసీ భూపతి తెలియజేశారు.

చీఫ్ ఇంజనీర్ల దృష్టికి ఫ్లై ఓవర్ బ్రిడ్జి సమస్య

రాయగడ: పట్టణం నడిబొడ్డున ఉన్నఫ్లైఓవర్ బ్రిడ్జి సమస్యను బీజేపీ ఎస్సీ,ఎస్టీ రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షుడు కాళీరాం, కొరాపుట్ మాజీ ఎమ్మెల్యే రఘురాం మచ్చలు ఎన్‌హెచ్ అడిషనల్ చీఫ్ ఇంజనీర్ నళినీరాణి సబర్ దృష్టికి శుక్రవారం తీసుకువెళ్లారు. కొన్నాళ్లుగా రాయగడలోని ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్వహణ లోపం కారణంగా ప్రమాదకరంగా మారిందని వివరించారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి కపిలాస్ కూడలి వరకు బ్రిడ్జి అత్యంత దయనీయంగా మారిందని, అడుగడుగునా గుంతలతో ఉండటంతో వాహన రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించారు. బ్రిడ్జి దాదాపు శిథిలావస్థకు చేరుకోవడంతో ఎప్పుడు ఎటువంటి ప్రమాదం సంభవిస్తుందో నన్న భయాందోళనలతో వాహన చోదకులు బితుకుబితుకుమంటూ వాహనాలను నడుపుతున్నారని వివరించారు. నిత్యం వందలాది వాహనాల రాకపోకలు ఈ బ్రిడ్జి నుంచే కొనసాగుతున్న నేపథ్యంలో ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. బ్రిడ్జి మరమ్మతులకు సంబంధించి ఇప్పటికే పలుమార్లు స్థానిక ప్రజా ప్రతినిధులు ప్రభుత్వం దృష్టికి తీసుకురావడం కూడా జరిగిందని వివరించారు. అధికారులు స్పందించి బ్రిడ్జి మరమ్మతులు చేపట్టాలని కోరారు.



చీఫ్ ఇంజనీర్ నళినితో మాట్లాడుతున్న కాళీరాం, రఘురాం మచ్చ

చోరీ కేసులో నిందితులకు మూడేళ్ల జైలు శిక్ష

రాయగడ: చోరీ కేసుకు సంబంధించి విచారించిన ఎస్‌డీజేఎం వర్షాదాస్ ఐదుగురు నిందితులకు మూడళ్ల పాటు జైలు శిక్షతో పాటు రూ. 20 వేల జరిమానాను విధిస్తూ శుక్రవారం తీర్పునిచ్చారు. జరిమానా చెల్లించలేని పక్షంలో అదనంగా మరో ఆరు నెలలు జైలు శిక్షను అనుభవించాల్సిందిగా పేర్కొన్నారు. వివరాల్లోకి వెళితే.. గత జూన్ రెండో తేదీన స్థానిక గౌతంనగర్‌లో నివాసముంటున్న సుధీర్ కుమార్ పాఢి ఇంట్లో దొంగతనం జరిగింది. బంగారు ఆభరణాలు, వెండి ప్లేట్‌తో సహా పది వేల రూపాయల నగదును దొంగిలించినట్లు సదరు పోలీస్‌స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి ఈ మేరకు అశ్రీఫుల్ షేక్, మహ్మద్ రోజి శేఖ్ , మహ్మద్ ఆలిమిన్, షేక్ బాబు, సమీర్ శేఖ్‌లు పోలీసులు అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. శుక్రవారం ఈ మేరకు కేసు విచారించిన న్యాయస్థానం శిక్షను ఖరారు చేసింది.

• గజరాజుల గమనం



నగరం శివార్లు చందక అభయారణ్యంలో విడిది చేసిన ఏనుగుల గుంపు కటక్ జిల్లా అఠాగొడా అటవీ విభాగం ఆధీనంలో ఉన్న సుకాసన అభయారణ్యం వైపు దారి తీశాయి. ఈ గుంపులో 22 ఏనుగులు ఉన్నట్లు అధికార వర్గాల సమాచారం. వాటిలో 6 గున్న ఏనుగులు ఉన్నట్లు గుర్తించారు. శుక్రవారం ఉదయం 6 గంటల ప్రాంతంలో డొలొఖాయి ఆలయం సమీపంలో ఈ ఏనుగుల గుంపు రోడ్డు దాటుతున్నట్లు గమనించారు. గత కొద్ది కాలంగా ఈ గుంపు చందకా అభయారణ్యంలో కనిపిస్తోంది. - భువనేశ్వర్

చేతబడి నెపంతో వృద్ధుడి దారుణ హత్య



హత్యకు గురైన నారాయణ మండంగి

రాయగడ: జిల్లాలోని కారుబాయి పంచాయతీ పరిధిలో గల సనొసిగురు గ్రామంలో ఒక వృద్ధుడు దారుణ హత్యకు గురయ్యాడు. చేతబడి చేస్తున్నాడన్న నెపంతో గ్రామంలో కొందరు యువకులు అతడిని హత్య చేశారు. మృతుడిని నారాయణ మండంగి (60)గా గుర్తించారు. సమాచారం తెలుసుకున్న శెఖిల్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం నాడు చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలియజేసిన వివరాల ప్రకారం... సన్నొసిగురు గ్రామంలో నివసిస్తున్న నారాయణ మండంగి అనే వృద్ధుడు గత కొద్ది కాలంగా చేతబడి చేస్తున్నట్లు గ్రామస్తులు అనుమానిస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం నాడు ఇంటిలో ఒక్కడే ఉన్నాడని తెలుసుకున్న కొందరు గ్రామానికి చెందిన యువకులు ఇంటిలోకి చొరబడి నారాయణను బయటకు లాక్కుంటూ వచ్చి మరణాయుధాలతో దాడి చేశారు. ఈ దాడిలో వృద్ధుడు మృతి చెందాడు. ఈ మేరకు బాధిత కుటుంబీకులు శెఖిల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గిరిజనుల ప్రయోజనాలు రక్షించాలి

భువనేశ్వర్: పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పనులతో రాష్ట్రంలో మల్కన్‌గిరి జిల్లా తీవ్రంగా ప్రభావితం అవుతుంది. ఈ విపత్తు నివారణ నేపథ్యంలో చొరవ తీసుకోవాలని రాష్ట్రానికి చెందిన కేంద్ర దళిత వ్యవహారాల విభాగం మంత్రి జుయెల్ ఓరాంకు బిజూ జనతా దళ్ ప్రతినిధి బృందం వినతి పత్రం సమర్పించింది. బీజేడీ అధ్యక్షుడు నవీన్ పట్నాయక్ ఆదేశాల మేరకు ఈ విషయమై కేంద్ర పర్యావరణ, అటవీ-వాతావరణ మార్పుల మంత్రి బి.యాదవ్‌ను కలిసినట్లు బీజేడీ ప్రతినిధి బృందం సభ్యులు తెలిపారు. మల్కన్‌గిరిలో గిరిజనుల ప్రయోజనాల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని ఇరువురు మంత్రుల్ని అభ్యర్థించారు. పోలవరం ప్రాజెక్టును అమలు చేయడంలో సుప్రీం కోర్టు పరిశీలనలను విస్మరించినట్లు మంత్రుల దృష్టికి తీసుకువెళ్లారు.



కేంద్ర దళిత వ్యవహారాల విభాగం మంత్రి జుయెల్ ఓరాంకు వినతి పత్రం సమర్పించిన బీజేడీ ప్రతినిధి బృందం

పూర్వ విద్యార్థులు విజ్ఞాన వారధులు: గవర్నర్

• అడ్వకేట్ జనరల్ పీతాంబర్ ఆచార్య



ఉత్కళ పూర్వ విద్యార్థుల సంఘం పంచమ వ్యవస్థాపక దినోత్సవంలో గవర్నర్ ప్రసంగం



గవర్నర్‌ను సత్కరించిన ఉత్కళ విశ్వ విద్యాలయం పూర్వ విద్యార్థులు

భువనేశ్వర్: విద్య వ్యక్తిగత విజయ సంకేతానికి పరిమితం కాదని, జ్ఞానోదయ సమాజ ఆవిష్కరణతో సమయానుకూల మగనుగడకు బలమైన వారధిగా నిలవాలని రాష్ట్ర గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి స్థానిక ఉత్కళ విశ్వవిద్యాలయ పూర్వ విద్యార్థులకు పిలుపునిచ్చారు. వాణీ విహార్ ఉత్కళ విశ్వ విద్యాలయం క్యాంపస్‌లో ఎంకేసీజీ ఆడిటోరియంలో ఉత్కళ విశ్వ విద్యాలయ పూర్వ విద్యార్థుల సంఘం 5వ వార్షికోత్సవంలో ఆయన ప్రసంగించారు. ఎనిమిది దశాబ్దాల పైబడి ఘన చరిత్ర కలిగిన ఉత్కళ విశ్వ విద్యాలయం రాజకీయాలు, పాలన, సైన్స్, విద్య, సాహిత్యం, చట్టం, సంస్కృతి, వ్యాపారం, ప్రజా జీవితంలో బహుముఖ ప్రజ్ఞాశాలుల్ని తీర్చిదిద్దిందని తెలిపారు. విద్యా నైపుణ్యత విలువల్ని గుర్తించే దిశలో యువ విద్యార్థులకు మార్గదర్శకత్వం, గ్రీన్ అండ్ క్లీన్ క్యాంపస్ ఉద్యమం వంటి చొరవలకు పూర్వ విద్యార్థులు ప్రోత్సహించడం హర్షణీయమన్నారు. విశ్వ విద్యాలయ జీవితం స్వీయ-ఆవిష్కరణ, విలువల రూపకల్పనతో జీవిత లక్ష్యం దశదిశ నిర్ధారించే అత్యద్భుత ఘట్టమని చెప్పారు. కార్యక్రమానికి ప్రముఖ వక్తగా హాజరయ్యారు. వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జగ్నేశ్వర్ దండపట్ గౌరవ అతిథిగా, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ సత్యజిత్ మహంతి, ప్రధాన కార్యదర్శి దేబేంద్ర ప్రసాద్ దాస్ వందలాది మంది పూర్వ విద్యార్థులు హాజరై సమావేశంలో ప్రసంగించారు.



ఉత్కళ విశ్వ విద్యాలయం పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

న్యూస్‌రీల్

వారాహిమాతకు విశేష పూజలు



కుంకుమ పూజల్లో మహిళలు

రాయగడ: శ్రావణమాసం ఆఖరి శుక్రవారాన్ని పురస్కరించుకుని రాయగడలోని బ్రాహ్మణవీధి కోదండరామ మందిరంలో వారాహి మాత పూజలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మందిరం ప్రధాన అర్చకులు అనంత ఆచార్యుల ఆధ్వర్యంలో విశేషపూజలు జరిగాయి. ఈ సందర్భంగా సామూహిక కుంకుమ పూజలను నిర్వహించారు. అధికసంఖ్యలో మహిళలు పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

11,111 బంగారు పుష్పాలతో పూజలు



లలితా త్రిపుర సుందరి అమ్మవారి ముందు బంగారు పుష్పాలు

కొరాపుట్: లలితా త్రిపుర సుందరి అమ్మవారికి 11,111 బంగారు పుష్పాలతో విశేష అర్చన జరిగింది. శుక్రవారం కొరాపుట్ జిల్లా బొరిగుమ్మ సమితి కేంద్రంలో శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి గుడిలో శ్రావణ మాస శుక్రవారం పూజలు ఘనంగా జరిగాయి. అందులో భాగంగా బంగారు పుష్పాలతో పాటు మరో 11,111 కలువ పువ్వులతో అమ్మవారికి అర్చన చేశారు.

కరాటేలో శ్రేయాస్‌కు కాంస్య పతకం



కాంస్య పతకాన్ని అందుకుంటున్న శ్రేయాస్

రాయగడ: ఈనెల 17వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం రాయిపూర్‌లోని తెలిబంధ అగ్రసేన్ మండపంలో జరిగిన 32వ జాతీయ స్థాయి కరాటే చాంపియన్ షిప్-2025 పోటీల్లో రాయగడకు చెందిన శ్రేయాస్ చౌదరికి కాంస్య పతకం లభించింది. ఈ పోటీల్లో ఒడిశా రాష్ట్రం నుంచి నలుగురు యువకులు పాల్గొనగా సబ్ జూనియర్ విభాగంలో శ్రేయాస్ కాంస్య పతకం దక్కించుకున్నాడు. దీంతో అతడిని ఒడిశా కరాటే అసోసియేషన్‌కు చెందిన కార్యదర్శి షేక్ సాజు, అధ్యక్షుడు బి.శ్రీనివాస్‌రావు తదితరులు అభినందించారు.

అమరులకు నివాళులు



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యేలు, గిరిజన ప్రజలు

మల్కన్‌గిరి: జిల్లాలోని మత్తిలి సమితిలో మత్తిలి మారణకాండ దినోత్సవాన్ని గిరిజన సంఘాలు గురువారం నిర్వహించారు. 1942 ఆగస్టు 21వ తేదీన సాహిద్ లక్ష్మణ్ నాయక్ నాయకత్వంలో జరిగిన పోరాటంలో 12 మంది స్వాతంత్ర్య సమరయోధులు మృతి చెందారు. ఈ ఘటనకు 83 ఏళ్లు పూర్తయిన సందర్భంగా అమరవీరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో మల్కన్‌గిరి ఎమ్మెల్యే నర్సింగ్ మడ్కమి, చిత్రకొండ ఎమ్మెల్యే మంగుఖిలో, చిత్రకొండ మాజీ ఎమ్మెల్యేలు పూర్ణచంద్ర బక్క, డొంబురు సీసా, మత్తిలి బీజేడీ నాయకురాలు లక్ష్మీప్రియ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ట్రక్కు ఢీకొని దంపతులు మృతి



ఘటనా స్థలంలో గుమిగూడిన జనం

భువనేశ్వర్: ట్రక్కు ఢీకొన్న ఘటనలో దంపతులు దుర్మరణం పాలయ్యారు. కటక్ ప్రాంతం గోపాల్‌పూర్‌లో బైక్‌ను ట్రక్కు ఢీకొనడంతో ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. మృతులను భువనేశ్వర్‌కు చెందిన దంపతులుగా గుర్తించారు. దుర్ఘటనకు పాల్పడిన ట్రక్కును కటక్ సదరు థానా పోలీసులు స్వాధీనం చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

క్లుప్తంగా

లక్ష్మీనృసింహునికి సాలగ్రామ హారం



సాలగ్రామహారంతో దర్శనం ఇస్తున్న లక్ష్మీనృసింహుడు

రాయగడ: సదరు సమితి అమలాభట్ట సమీపంలోని శ్రీక్షేత్ర టౌన్‌షిప్‌లో కొలువైయున్న శ్రీలక్ష్మీనృసింహునికి సాలగ్రామ హారంతో అలంకరించారు. ప్రముఖ వేద పండితులు, స్థానిక బాలాజీనగర్‌లో గల కళ్యాణవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రధాన అర్చకులు భాస్కరాచార్యుల దంపతులు అత్యంత పవిత్రమైన 69 సాలగ్రామాలతొ రూపొందించిన హారాన్ని స్వామివారికి బహుకరించారు. లక్ష్మీనృసింహస్వామి ఆలయం అర్చకులు మంగనాథ ఆచార్యుల పర్యవేక్షణలో శ్రావణమాసం ఆఖరి శుక్రవారం ప్రత్యేక పూజలను నిర్వహించి ఈ హారాన్ని స్వామి వారి మెడలొ అలంకరించారు. ఆలయ ధర్మకర్త దూడల శ్రీనివాస్ తదితరులు ఈ కార్యక్రమంలొ పాల్గొన్నారు. ఈ సందర్బంగా సాలగ్రామా హారం బహుకరించిన భాస్కరాచార్యులకు ఆలయ ధర్మకర్త శ్రీనివాస్ ధన్యవాదాలు తెలియజేశారు.

500 ఎకరాలలో పామాయిల్ సాగు



కుంధ్రాలో పామాయిల్ మొక్క నాటుతున్న అధికారులు

జయపురం: జయపురం సబ్‌డివిజన్‌లో 500 ఎకరాలలో పామాయిల్ తోటలు పెంచేందుకు నిర్ణయించినట్లు ఉద్యోగ వ్యవసాయ విభాగ ప్రభుత్వ డైరెక్టర్ సంజీవ కుమార్ మహంతి వెల్లడించారు. మొదటి సారి జయపురం సబ్‌డివిజన్ కుంధ్ర సమితి బాగ్డెరి పంచాయతీ కుర్పకేట్‌లో పామాయిల్ తోటలు పెంచే కార్యక్రమానికి శుక్రవారం శ్రీకారం చుట్టారు. పామాయిల్ తోటలు పెంచేందుకు ముందుకు వచ్చే రైతులకు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందన్నారు. అలాగే బ్యాంక్ సహాయం అందే సౌకర్యం కల్పిస్తామని మహంతి వెల్లడించారు. ఈ పథకంలో లబ్దిదారుల ఎంపికతో పాటు భూములను గుర్తించటం జరిగిందన్నారు. ప్రభుత్వం ద్వారా ప్రారంభించబడిన జాతీయ వంట నూనె (ఎడిబుల్ ఆయిల్)మిషన్-పామ్‌ఆయిల్ పథకంలో జయపురం సబ్‌డివిజన్‌లోని జయపురం, బొరిగుమ్మ, బొయిపరిగుడ, కొట్‌పాడ్, కుంధ్ర సమితిలలో 500 ఎకరాలలో పామాయిల్ తోటలు పెంచుతామన్నారు. స్థానిక బలిపెట వీధిలోని రైతు సుధాంశు శేఖర పాత్రోకు కుంధ్ర సమితి బాగ్డెరి పంచాయతీలో గల 4.8 హెక్టార్లలో పామ్ ఆయిల్ మొక్కలు నాటామన్నారు. వాతావరణం అనుకూలంగా ఉంటే 2029 నాటికి పంట ఉత్పత్తి ప్రారంభమౌతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. మిగతా సమితిలలో రైతులు పామాయిల్ మొక్కలు వేయాలని ఆసక్తి చూపుతున్నారన్నారు. కార్యక్రమంలో ఏహెచ్‌ఓ సునీల్ కుమార్ సాహు ఉన్నారు.

మెగాస్టార్ జన్మదిన వేడుకలు



కేకును కట్‌చేస్తున్న చిరు అభిమానులు

పర్లాకిమిడి: స్థానిక జంగంవీధి వద్ద ఆర్.ఆర్. కళ్యాణ మండపంలో శుక్రవారం మెగాస్టార్ చిరంజీవి 70వ జన్మదిన వేడుకలను ఆయన అభిమాన సంఘం ఘనంగా జరుపుకున్నారు. చిరంజీవి ఫ్యాన్సు అలిజింగి రాము, శివ, శ్యాం తదితరులు కేక్ కట్‌చేసి అభిమానులు సందడి చేసుకున్నారు.

ఆరు బయటే ఇంజెక్షన్లు

కొత్తూరు: కొత్తూరు ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది నిర్వాకం విస్తుగొలుపుతోంది. రోగులకు ఇంజెక్షన్ ఇవ్వాల్సి వచ్చినప్పుడు పురుషులకు, మహిళలను ప్రత్యేక గదుల్లో ఉంచి బెంచీ మీద కూర్చోబెట్టి, లేదంటే మంచం మీద పడుకోబెట్టి ఇంజెక్షన్ వేయాల్సి ఉంటుంది. ఈ ఆస్పత్రిలో పురుషులు, మహిళలకు ఒకేచోట ఇంజెక్షన్ వేస్తున్నారు. ఆరుబయట చేస్తుండడంపై మహిళలు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి పురుషులకు, మహిళలకు వేర్వేరుగా గదులు ఏర్పాటు చేసి ఇంజెక్షన్లు వేయించాలని పలువురు కోరుతున్నారు.

కలెక్టర్ సోమేష్ ఉపాధ్యాయ్ సుడిగాలి పర్యటన



పిల్లలు పాఠాలు చెబుతున్న కలెక్టర్ సోమేష్ ఉపాధ్యాయ్



అభివృద్ధిపై గ్రామస్తులతో చర్చిస్తున్న కలెక్టర్ సోమేశ్



ముదిలిపాడలో అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ సోమేశ్



విద్యార్థులకు ప్రశ్నలు వేస్తున్న కలెక్టర్



సీతాంకుంట జలాశయం ప్రాంత్రంలో పర్యటిస్తున్న కలెక్టర్ సోమేశ్, ఇతర అధికారులు

మల్కన్‌గిరి: జిల్లా కలెక్టర్ సోమేశ్ ఉపాధ్యాయ్ వివిధ ప్రాంతాల్లో శుక్రవారం సుడిగాలి పర్యటన చేశారు. ఖోయిర్‌పూట్ సమితి బోండాఘాటిలో తొలిసారిగా పర్యటంచిన ఆయన ముందుగా ముదులిపోడ పంచాయతీలోని ఎస్ఎస్‌డీ బాలికల విద్యాలయాన్ని సందర్శించారు. తరగతి గదులు పరిశీలించడంతోపాటు పిల్లలకు బోధన చేశారు. విద్యార్థులకు ప్రశ్నలు వేసి జవాబులు రాబట్టారు. ఘాటిలో విద్యా ప్రమాణాలు ఎలా ఉన్నాయో ఆరాతీవారు.పిల్లలు చెప్పన శ్లోకాలను విని సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం బోండాఘాటీపై జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులపై ప్రజలతో సమావేశమై చర్చించారు వైద్య, రవాణా సౌకర్యాలపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.

నేడు సప్తపురి అమావాస్య



ఆలం చండీ పీఠంలో సత్తాపురి పాత్రల ప్రత్యేక పూజాదులు



ఆలం చండీ ఆలయం నుంచి సత్తాపురి పాత్రల తరలింపు



శ్రీ మందిరానికి చేరిన సత్తాపురి మట్టి పాత్రలు

భువనేశ్వర్: పూరీ శ్రీ జగన్నాథ ఆలయంలో శుక్రవారం పవిత్ర భాద్రపద మాసం కృష్ణ పక్ష చతుర్ధశి సందర్భంగా సత్తాపురి తడొ విజే నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయంలో ధూపం ముగిసిన తర్వాత కుమ్మరి బిసాయి, లెంక, ఘంటువా, ఛొత్తి వర్గీయ సేవకులు ఆలం చండీ మాత ఆలయం నుంచి మట్టి పాత్రలను శ్రీ మందిరానికి తరలించడాన్ని సత్తాపురి తొడొ విజేగా పేర్కొంటారు. ఒకొరొనొలా ప్రాంతం ఆలం చండీ మాత ఆలయంలో ముందస్తుగా సిద్ధం చేసిన మట్టి పాత్రల్లో సప్తపురి అమావాస్య నాడు స్వామికి మిఠాయి నివేదిస్తారు. ఈ నేపథ్యంలో ముందు రోజు చతుర్దశి నాడు ఆలం చండీ మాత పీఠం నుంచి శ్రీ మందిరానికి సప్తపురి మట్టి పాత్రల్ని తరలించారు. మధ్యాహ్న ధూపం తర్వాత శ్రీ మందిరం నుంచి ఆజ్ఞా మాలలతో ఘంటా, ఛత్రీ వర్గీయ సేవకులు ఆలం చండీ మాత ఆలయానికి చేరి ప్రత్యేక పూజాదులు నిర్వహించిన తర్వాత కుమ్మరి వర్గీయ సేవకులు ఆలం చండీ మాత పీఠం నుంచి 4 పెద్ద మట్టి పాత్రల్ని ఊరేగింపుగా శ్రీ మందిరానికి తరలించారు. సింహ ద్వారం గుండా శ్రీ మందిరంలోనికి ప్రవేశించి ఒకమారు ప్రదక్షిణ చేసి బెహెరాణొ ఆవరణలో ప్రతిహారి సేవకులకు అప్పగించారు. సంధ్యా ధూపం తర్వాత పూజా పండా సేవకులు శ్రీ అంగం (మూల విరాటు) నుంచి పొందిన ఆజ్ఞా మాలలతో దక్షిణ కాళీ మాత పీఠం సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజాదులు నిర్వహించిన తర్వాత ఆచారం ప్రకారం దక్షిణ కాళీ మాత సేవకులు ఆజ్ఞా మాలలను కార్మికులకు అందజేశారు. దీంతో స్వామి ఆజ్ఞ ప్రాప్తించినట్లు పరిగణించి మర్నాడు ఉదయం ఈ పాత్రల్లో సత్తాపురి మిఠాయి తయారు చేసి అమావాస్య నాడు ఉదయం ప్రాతః ధూపం తర్వాత శ్రీ జగన్నాథునికి సత్తాపురి మిఠాయి నివేదిస్తారు.

10 అడుగుల కొండచిలువ పట్టివేత



కొండచిలువను పట్టి అడవి వద్ద విడిచిపెడుతున్న దృశ్యం



పామును పట్టిన రాకేష్ హల్దార్

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి కంగుర్‌కొండ పంచాయతీకి చెందిన భీమా మడ్కమి అనే వ్యక్తి ఇంటి గోడ వద్ద పది అడుగుల కొండ చిలువ గురువారం రాత్రి కనిపించింది. భార్య చూసి కేకలు వేయడంతో వెంటనే భీమా కలిమెల అటవీ శాఖకు సమాచారం ఇవ్వడం తో రెంజార్ విజయ్ కుమార్ నాయిక్ తన సిబ్బంది, స్నేక్‌హెల్ప్ లైన్ సభ్యుడు రాకేష్ హల్దార్‌తో వచ్చి రెండు గంటలు శ్రమించి పామును పట్టుకున్నారు. కోళ్లను తినడానికి వచ్చినట్లు తెలుస్తోంది. అనంతరం పామును రాకేష్ అడవిలో సురక్షితంగా విడిచిపెట్టారు.

ఉప్పలాడ గ్రామంలో మూడు షాపుల్లో చోరీ



ఉప్పలాడ గ్రామంలో కిరాణా షాపులో చోరీ



మరో కిరాణాషాపు గేట్లు పగులగొట్టి చోరీ చేసిన వైనం

పర్లాకిమిడి: పర్లాకిమిడికి పది మైళ్ల దూరంలో ఉన్న ఉప్పలాడ గ్రామంలో గత రాత్రి రెండు కిరాణా, ఒక ఇంగ్లిష్ మందుల షాపుల్లో దొంగతనం జరిగి సుమారు రూ.45 వేలు దోపిడీకి గురైందని ఉప్పలాడ వ్యాపారి జి.సంతోష్ కుమార్ గురండి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. గుసాని సమితి ఉప్పలాడ గ్రామంలో గురువారం రాత్రి వరుసగా మూడు షాపుల తాళాలు విరగ్గొట్టి, గేట్లు కత్తిరించి షాపులో ఉంచిన నగదును కాజేసినట్లు వ్యాపారులు ఫిర్యాదు చేశారు. ఉప్పలాడ గ్రామంలో జి.సంతోషకుమార్ గత రాత్రి పదిగంటలకు షాపును మూసివేశాడు. ఉదయం షాపు తలుపులు తెరిచి ఉండటంతో గల్లా పెట్టె చూడగా నగదు కనిపించలేదు. ఈ కిరాణా షాపులో ఉంచిన నగదు రూ.25 వేలు పోయిందని చెప్పాడు. మూడు షాపుల వ్యాపారుల ఫిర్యాదు మేరకు గురండి పోలీసు ఐఐసీ ఓం నారాయణ పాత్రో ఉప్పలాడ విచ్చేసి కేసును దర్యాప్తు చేపట్టారు.

ఘనంగా పండిత గోపినాథ నోందో శర్మ జయంతి



మాట్లాడుతున్న ఉన్నత విద్యాశాఖ ప్రాంతీయ సంచాలకులు కులమణి ఒరుూ

పర్లాకిమిడి: స్థానిక ఒడియా మంగలివీధిలో ఉత్కళ హితేషిణీ సమాజ్ హాలులో శుక్రవారం సాయంత్రం పండిత గోపినాథ నోందో శర్మ జయంతి ఉత్సవాన్ని ఉత్కళ సాహిత్య అకాడమి ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో జరుపుకున్నారు. ఉత్సవాన్ని ఉన్నత విద్యాశాఖ ప్రాంతీయ సంచాలకులు కులమణి ఓరుూ విచ్చేసి పండిత గోపినాథ నోందో చిత్రపటానికి జ్యోతిని వెలిగించి ప్రారంభించగా, గౌరవ అతిథులుగా పూర్ణచంద్ర మహాపాత్రో, బినోదిని సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ మనోజ్ పట్నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్బంగా కులమణి ఓరుూ మాట్లాడుతూ.. పండిత గోపినాథ నోందో శ్రీకాకుళం జిల్లా మందస గ్రామంలో పుట్టి పర్లాకిమిడిలో పెరిగి విద్యాభ్యాసం చేశారని, ఆయన ఒడియా, తెలుగు భాషలో 1907లో సీతావనవాసం, 1910లో జానకీ పరిణయం, ఒడియా భాషా తత్వ బోధినీ అవధానం, శబ్దతత్వ బోధినీ, శ్రీభారత్ దర్పణ్ వంటి ఎనిమిది పుస్తకాలు రచించారని అన్నారు. ఆయన రచించిన ఉభయరత్నమాల ఇంతవరకూ ప్రచురణకు నోచుకోలేదన్నారు. ఈ సందర్బంగా రీజనల్ డైరెక్టర్ కులమణి ఓరుూను ఉత్కళ హితేషిణీ కార్యదర్శి పూర్ణచంద్ర మహాపాత్రో దుశ్శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో ఓఎస్‌వో అసిస్టెంట్ సెక్రటరీ సంజయ్ కుమార్ స్వాలసింగి, బరంపురం విశ్వవిద్యాలయం (హెచ్‌వోడీ) సదానంద నాయక్, బిచిత్రానంద బెబర్తా పాల్గొన్నారు.

అంధకారంలో జిల్లా కేంద్రాస్పత్రి



మొబైల్ టార్చ్ లైట్ల సహాయంతొ రోగులకు వైద్య పరీక్షలు

రాయగడ: మొబైల్ టార్చ్ లైట్ల సహాయంతో సుమారు మూడు గంటల పాటు వైద్య సేవలు కొనసాగాయి. ఇదేదో మారుమూల పీహెచ్‌సీ, సీహెచ్‌సీ కేంద్రాల్లో చోటు చేసుకుందంటే తప్పులో కాలేసినట్టే. సాక్షాత్తు జిల్లా కేంద్రాస్పత్రిలో ఈ ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. టీపీఎస్‌డీవోఎల్ (విద్యుత్‌శాఖ) సంస్థ విద్యుత్ మరమ్మతు పనులకు సంబంధించి శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తున్నట్లు ముందస్తుగానే ప్రకటించింది. అయితే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న వారి నిర్లక్ష్యం కారణంగా రోగులు నానా అవస్థలు పడ్డారు. విద్యుత్ కొత కారణంగా సరఫరా నిలిచిపోవడంతో వివిధ వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగులు ఇబ్బందులు పాలయ్యారు. విద్యుత్‌కు అంతరాయం ఏర్పడితే అత్యవసర పరిస్థితిలొ ఉండే జనరేటర్ మొరాయించడంతొ సమస్య మరింత జటిలమయ్యింది . హస్పటల్‌కు చికిత్స కొసం వచ్చే రొగుల రక్తనమూనాలు సేకరించే వార్డులొ, అదేవిధంగా అవుట్‌డొర్ పెసేంట్ల వార్డుల్లొ విద్యుత్ లేకపొవడంతొ అంధకారంగా మారింది. దీంతొ రొగుల మొబైల్ టార్చ్‌లైట్ల సహయంతొ వైద్యులు వారికి పరీక్షలను నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. మూడు గంటల పాటుగా ఇదే తంతు కొనసాగింది. అనంతరం జన రేటర్‌ను బాగు చేయడంతొ పరిస్థితి మెరుగుపడింది.

ఆది కర్మ యోగి అభియాన్ ప్రారంభం



మాట్లాడుతున్న నోడల్ అధికారి అంశుమాన్ మహాపాత్రో

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో ఆది కర్మ యోగి అభియాన్ కార్యక్రమాన్ని కలెక్టర్ మధుమిత శుక్రవారం ప్రారంభించారు. జిల్లాలో ఆకాంక్ష బ్లాక్ కేంద్రాలు గుమ్మా, ఆర్.ఉదయగిరితో పాటు అన్ని గ్రామీణ ప్రాంతాల్లో ఆది కర్మయోగి అభియాన్ కింద ఆరోగ్యం, పౌష్టికాహారం, విద్య, తాగునీరు వనరులు, వ్యవసాయం, ఉపాధి వికేంద్రీకరణ అభివృద్ధికి కృషి చేస్తామని ఐటీడీఏ పీవో అంశుమాన్ మహాపాత్రో అన్నారు. జిల్లాలో 7 మండలాల్లోని 108 గ్రామ పంచాయతీల్లో ఈ పథకం అమలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అదనపు జిల్లా మాజిస్ట్రేట్ ఫాల్గునీ మఝి, జిల్లా ముఖ్య వైద్యాధికారి డా.మహ్మద్ ముబారక్ ఆలీ, మిషన్ శక్తి డైరక్టర్ టిమోన్ బోరా, సీసీడీ సంస్థ కార్యదర్శి ఎ.జగన్నాథ రాజు తదతరులు పాల్గొన్నారు.

బీఎస్ఈ, సీహెచ్ఎస్ఈ విలీనం



పాఠశాలలు, సామూహిక విద్యా విభాగం పనితీరు సమీక్షించిన ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి

భువనేశ్వర్: రాష్ట్రంలో మాధ్యమిక విద్యా బోర్డు (బీఎస్ఈ), ఉన్నత మాధ్యమిక విద్యా మండలి (సీహెచ్ఎస్ఈ) విలీనం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. స్థానిక లోక్ సేవా భవన్‌లో పాఠశాలలు, సామూహిక విద్యా శాఖ వివిధ కార్యకలాపాలను సమీక్షించిన సందర్భంగా ప్రతిపాదించిన ఆమోదంపై ముఖ్యమంత్రి సుముఖత వ్యక్తం చేశారు.

ఒకే బోర్డు ఆధ్వర్యంలో పాఠశాల విద్య

పాఠశాల విద్యా వ్యవస్థని ఒకే బోర్డు ఆధ్వర్యంలో నిర్వహించాలని భారీ సంస్కరణకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన సమీక్ష సమావేశంలో ఈ మేరకు నిర్ణయించారు. ఈ నిర్ణయం ప్రకారం మాధ్యమిక విద్యా బోర్డు (బీఎస్ఈ), ఉన్నత మాధ్యమిక విద్యా మండలి (సీహెచ్ఎస్ఈ) లను ఒకే విద్యా బోర్డుగా విలీనం చేస్తారు. విద్యా బోధన వ్యవస్థ సామర్థ్యం, పాలనను మెరుగుదల లక్ష్యంగా ఈ విలీనం సంకల్పించినట్లు ప్రకటించారు.

విద్యార్థి సంక్షేమ చర్యలు

అన్ని వర్గాల 9, 10 తరగతుల విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు అందిస్తారు. ప్రస్తుతం షెడ్యూల్డ్ కులాలు/షెడ్యూల్డ్ తెగలు విద్యార్థులు మాత్రమే ఈ సౌకర్యం పొందుతున్నారు. హాస్టళ్లలో ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ బలోపేతం చేయడానికి ప్రతి 300 మంది విద్యార్థులకు ఒక బహుళార్థ సాధక ఆరోగ్య కార్యకర్తతో సహాయక నర్స్ మిడ్‌వైవ్‌లను (ఏఎన్ఎంలు) నియమిస్తారు.

గిరిజన బాలలకు మాతృభాషలో బోధన

గిరిజన పిల్లలకు వారి మాతృ భాషలో బోధించడంపై ముఖ్యమంత్రి దృష్టిని సారించారు. కొరాపుట్‌లో బహుభాషా విద్యా కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదనంగా, దివ్యాంగ బాలల బోధన కోసం బి.ఎడ్. అర్హత కలిగిన ఉపాధ్యాయులను రిసోర్స్ పర్సన్‌లుగా నియమిస్తారు.

మూడేళ్లలో 44,433 మంది ఉపాధ్యాయుల నియామకం

ప్రాథమిక విద్యను బలోపేతం చేసేందుకు ఏటా దాదాపు 15,000 మంది వంతున రానున్న 3 ఏళ్లలో 44,433 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని నిర్ణయించారు. జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ) 2020కి అనుగుణంగా ఉపాధ్యాయ పదవుల ఖాళీలను భర్తీ చేస్తారు. ప్రస్తుతం రాష్ట్రంలో 45,292 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 1,60,319 మంజూరు చేయబడిన ఉపాధ్యాయ పోస్టులు ఉన్నాయి. ఎన్ఈపీ 2020 మార్గదర్శకాల మేరకు మరో 39,366 ఉపాధ్యాయ పదవులు సృష్టిస్తారు.

డిజిటల్ ప్రోత్సాహం, సంస్థాగత బలోపేతం

ప్రైవేట్ పాఠశాలలకు ఆమోదం ప్రక్రియ పూర్తిగా డిజిటలైజ్ చేస్తారు. ఎన్‌సీఈఆర్‌టీ ఫ్రేమ్‌వర్క్‌కు అనుగుణంగా స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎస్‌సీఈఆర్‌టీ)గా పునరుద్ధరిస్తారు. సమావేశంలో పాఠశాలలు, సామూహిక విద్యా విభాగం మంత్రి నిత్యానంద గోండ్, ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి మనోజ్ ఆహుజా, ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ కార్యదర్శి శాశ్వత్ మిశ్రా, ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి సంజీవ్ మిశ్రా, పాఠశాలలు, సామూహిక విద్యా శాఖ కార్యదర్శి షాలిని పండిట్, ఓఎస్ఈపీఏ డైరెక్టర్, ఆ శాఖ సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

సామూహిక కుంకుమ పూజలు



పూజలందుకుంటున్న శ్రీలలితాదేవి



సాముహిక కుంకుమ పూజల్లో మహిళలు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కేంద్రంలోని కన్యకా పరమేశ్వరీ కళ్యాణ మండపంలో శ్రావణమాసం చివరి శుక్రవారం సందర్భంగా కళింగ వైశ్య సమాజ్ తరపున తెలుగు సాంప్రదాయ విధానంలో తెలుగు పంతులమ్మ మహాలక్ష్మి సాముహిక కుంకమా పూజలు నిర్వహించారు. పూజల్లో కళింగ వైశ్య మహిళలతో పాటు స్థానిక ముతైదువులు పాల్గొని శ్రీలాలితా దేవికి ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు .జిల్లా కళింగ వైశ్య సమాజ్ తరపున అన్నదానం చేశారు.

ఘనంగా లలితా దేవి పూజలు





పూజల్లో మహిళలు

జయపురం: జయపురంలోని పలు దేవాలయాలలో శ్రావణ ఆఖరి శుక్రవారాల పూజలతో పాటు శ్రీలలితా దేవి పూజలు భక్త శ్రద్ధలతో మహిళలు చేశారు. ఉదయం నుంచే మహిళలు దేవాలయాలలో దేవతామూర్తులకు పూజలు చేసేందుకు క్యూ కట్టారు. స్థానిక పూర్ణఘడ్‌లో లలితాదేవి ఆలయంలో వందలాది మంది మహిళలు దేవిలలితా దేవికి పూజలు జరిపారు. ఆలయ పూజారి సూర్యనారాయణ పంతులు ఈ రోజు ప్రాధాన్యత లలితా దేవి చరిత్ర భక్తులకు తెలిపి మహిళలచే పూజలు జరిపించారు. జయపురం పట్టణం జమాల్ లైన్‌లో వెంచేసి ఉన్న శ్రీరామ మందిరంలో లలితాంబిక దేవికి అష్టోత్తర శతనామావళి కుంకుమ పూజలు వేడుకగా జరిపారు. పూజారులు అన్నవరపు కోటేశ్వర శర్మ, ఉరిమిలి నాగేశ్వరరావు పంతులు భక్తులచే పూజలు చేయించారు.

రోడ్డు ప్రమాదంలో పోలీసులకు తీవ్రగాయాలు



చికిత్స పొందుతున్న రజాన్ కుమార్

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి సమితి బిజాఘాట్టిలో శుక్రవారం మధ్యాహ్నం బైక్‌పై వస్తున్న ఇద్దరు పోలీసులను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. అదే సమయంలో అటుగా వస్తున్న వీడియో జర్నలిస్టు జానికి పట్నాయక్, చక్రధర్ పట్నాయక్, సమాజ్ సేవకుడు నగేశ్వర్ పట్నాయెక్ బోరాజా గ్రామానికి వెళ్లి వస్తుంగా.. రక్తపు మడుగులో పడివున్న వ్యక్తిని చూసి మానవత్వంతో జిల్లా ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన వ్యక్తి మత్తిలి సమితికి చెందిన పోలీసు ఉద్యోగి రజాన్ కుమార్‌గా గుర్తించారు. మరొకరికి స్వల్పగాయాలు అయ్యాయి. రజాన్ తల, చేతికి తీవ్రంగా గాయాలు కావడంతో జిల్లా ఆస్పత్రి వైద్యులు ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తున్నారు.

క్లుప్తంగా

జిల్లా యువకుడికి జాతీయ స్థాయిలో గోల్డ్ మెడల్



జాతీయ స్థాయి పోటీల్లో పతకం సాధించిన రామకృష్ణ

విజయనగరం: ఝార్ఖండ్ రాష్ట్రంలో జరిగిన జాతీయ స్థాయి సీనియర్స్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్-2025 పోటీల్లో విజయనగరానికి చెందిన శీల రామకృష్ణ జిల్లా గర్వించే విధంగా సంచలన ప్రదర్శన చేశాడు. విజయనగరం జిల్లా పరిషత్‌లో కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తున్న రామకృష్ణ ఈ నెల 18 నుంచి 21 వరకు ఝార్ఖండ్‌లో జరిగిన పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొని 550 కేజీల బరువు ఎత్తి గోల్డ్ మెడల్ సాధించాడు. విజయనగరానికి చెందిన వ్యక్తి జాతీయస్థాయి పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించడంపై జిల్లా వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తులో మరెన్నో విజయాలు సాధించడానికి ప్రభుత్వం సహాయం చేయాలని కోరుతున్నారు.

యువతిపై అసభ్యకర ప్రవర్తన



రామును స్తంభానికి కట్టేసిన దృశ్యం

రేగిడి: మండల పరిధిలోని ఉణుకూరు గ్రామంలో శుక్రవారం ఉదయం ఓ యువతిపై అదే గ్రామానికి చెందిన వ్యక్తి లైంగిక దాడికి పాల్పడ్డాడు. దీనిపై ఎస్సై పి.నీలావతి అందించిన సమాచారం మేరకు గ్రామానికి చెందిన 58 ఏళ్ల దిబ్బ రాము దళిత కాలనీకి చెందిన వ్యక్తి. మద్యం తాగిన మత్తులో అదే కాలనీలో ఓ యువతి ఒంటరిగా ఉండడాన్ని గమనించి ఇంట్లోకి దూరి అసభ్యకరంగా ప్రవర్తించాడు. వెంటనే బాధిత యువతి కేకలు వేయడంతో వీధిలోని యువకులు ఇంట్లోకి చొరబడి దిబ్బ రామును బయటకు తీసుకువచ్చి కరెంటు స్తంభానికి కట్టేశారు. ఈ విషయంపై రేగిడి పోలీసులకు సమాచారం అందడంతో గ్రామానికి వెళ్లిన పోలీసులు రామును అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. యువతి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

డీపీఓలో 'పోలీస్ వెల్ఫేర్ డే'



పోలీస్ వెల్ఫేర్ డేలో సిబ్బంది సమస్యలను తెలుసుకుంటున్న ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీస్ కార్యాలయం (డీపీఓ)లో పోలీస్ వెల్ఫేర్ డే శుక్రవారం జరిగింది. ఎస్పీ వకుల్ జిందల్ సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో శాఖా పరమైన సమస్యలను జిల్లా పోలీసులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. సిబ్బంది ఇచ్చిన వినతిపత్రాలను ఎస్పీ స్వీకరించి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఒక్కొక్కరిని తన చాంబర్‌లోకి పిలిచి వ్యక్తిగతంగా కాని, వృత్తిపరమైన సమస్యలు ఉంటే తన దృష్టికి తీసురావాలని ఎస్పీ చెప్పారు. అందులో భాగంగానే టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏళ్ల తరబడి పనిచేసిన పైడితల్లిని పిలిచి సమస్య తెలుసుకున్నారు. ఇంత వరకు టూటౌన్ ఏఎస్సైగా పనిచేసిన తనను కొన్ని కారణాలతో తొలగించారని ఆయన తెలిపారు. మళ్లీ తనకు గంట్యాడ కానీ, విజయనగరం రూరల్ పరిధిలో కానీ పోస్టింగ్ ఇప్పించాలని ఈ సందర్భంగా ఎస్పీని ఆయన కోరారు.

అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురంటౌన్: జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు డీఈఓ బి.రాజకుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యం మినహా ఇతర యాజమాన్య సంస్థల్లో పనిచేస్తున్న ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుల నుంచి జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు-2025 పురస్కారాలకు ప్రతిపాదనలు కోరుతున్నామని తెలిపారు. ఉపాధ్యాయుడిగా కనీసం 10 సంవత్సరాలు పనిచేసి ఉండాలన్నారు. ఈ నెల 26వ తేదీలోగా ఉప విద్యాశాఖాధికారి లేదా మండల విద్యాశాఖాధికారి కార్యాలయానికి దరఖాస్తులు అందజేయాలన్నారు.

ఇన్‌చార్జి పీఓగా బాధ్యతల స్వీకరణ

సీతంపేట: ఐటీడీఏ ఇన్‌చార్జి ప్రాజెక్టు అధికారిగా పాలకొండ సబ్ కలెక్టర్ పవర్ స్వప్నిల్ జగన్నాథ్ శుక్రవారం పూర్తి అదనపు బాధ్యతలు చేపట్టారు. ఆయనకు ఐటీడీఏలోని వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధిని సమీక్షిస్తానని, క్షేత్ర స్థాయిలో పర్యటించి అభివృద్ధి చేయాల్సిన వివరాలు తెలియజేస్తానన్నారు.

బాల్యంపై బ్యాగుల బరువు

- ప్రతి శనివారం అమలు కాని నో-బ్యాగ్ డే
- కంప్యూటర్ కాలంలోనూ విద్యార్థులకు కష్టాలు
- బ్యాగు బరువుతో అకెక్కిన ఆటలు
- చిన్నారుల్లో పెరుగుతున్న అనారోగ్య సమస్యలు
- పట్టించుకోని విద్యాశాఖ



బరువైన బ్యాగులతో స్కూల్ బస్సు ఎక్కుతున్న విద్యార్థులు

వీరఘట్టం: ప్రతి శనివారం బ్యాగు మోత లేకుండా విద్యార్థులకు ఆట, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు, చిత్రలేఖనంతో పాటు సామాజిక అంశాలపై పట్టు సాధించేలా బోధన చేపట్టి ఒక్క శనివారం మాత్రం నో బ్యాగ్ డే పాటించేలా చర్యలు తీసుకుంటామని ఇటీవల ప్రభుత్వం ప్రకటన చేసింది. అయితే ఈ ప్రకటన ఇంత వరకు అమల్లోకి రాలేదు. నేటి కంప్యూటర్ కాలంలోనూ విద్యార్థులకు బ్యాగుల బరువు మోత తప్పడం లేదు. ఆధునిక బోధన విధానంలోనూ చిన్నారులు మానసిక ఒత్తిడి నుంచి బయటపడటం లేదన్న విమర్శలున్నాయి. ఉల్లాసాన్ని ఇచ్చే క్రీడలు కనిపించడం లేదు. ఉత్సాహాన్నిచ్చే వాతావరణానికి దూరవుతున్నారు. కేంద్ర విద్యాశాఖ సైతం ఈ వాస్తవాలను ఒప్పుకుంది. చిన్నారులను బరువుల మోత నుంచి బయట పడేయాలని సూచనలు చేసింది. కానీ ఎక్కడా ఇది అమలుకు నోచుకోవడం లేదు.

ఆందోళనలో చిన్నారుల పరిస్థితి

కేంద్ర విద్యాశాఖ అధ్యయనం ప్రకారం 70 శాతం మంది విద్యార్థులు పుస్తకాల బరువుతో అనారోగ్యం పాలవుతున్నారు. కండరాలు, మోకాళ్లపై ఒత్తిడి పడుతోంది. 22 శాతం మందిని వెన్నెముక నొప్పి వెంటాడుతోంది. అతి చిన్న వయస్సులోనే నీరసం, భుజాలు వంగి పోవడం సర్వ సాధారణమైంది. 90 శాతం మందికి ఏడు గంటల నిద్ర కరువే. దీంతో తరగతి గదిలో చురుకుదనం తగ్గుతోంది. బహుళ అంతస్తుల భవనాల్లో ప్రైవేట్ బడులు ఉంటున్నాయి. బరువు వేసుకుని మెట్లు ఎక్కడంతో అనేక అనారోగ్య సమస్యలొస్తున్నాయి.

అమలు కాని నిబంధనలు..

పుస్తకాల బరువుపై కేంద్ర విద్యాశాఖ ఐదేళ్ల క్రితమే హెచ్చరించింది. చిన్నపిల్లల బరువులో పది శాతమే పుస్తకాల బరువు ఉండాలని స్పష్టం చేసింది. ఇలాంటి పరిస్థితి మరే దేశంలోనూ లేదని బరువుపై అధ్యయనం చేసిన యశ్‌పాల్ కమిటీ చెప్పింది. అధిక బరువు వల్ల కండరాలపై ఒత్తిడి పడి భవిష్యత్తులో దీర్ఘకాల సమస్యలు వెంటాడుతున్నాయని పలు అధ్యయనాలు వెల్లడించాయి. డిజిటల్ బోధన మేలని సూచించాయి. అయితే కోవిడ్ తర్వాత ప్రపంచం మొత్తం డిజిటల్ విద్య వైపు మళ్లుతున్నా..మనం ఆ దిశగా అడుగులేయడం లేదు. మార్కుల కోసం గంటల కొద్దీ చదివించే ప్రైవేట్ స్కూళ్లను కట్టడి చేసే దిక్కులేదు.

భుజాలు నొప్పిగా ఉంటాయి

రోజూ 35 పుస్తకాలను స్కూల్‌కు తీసుకెళ్లాల్సి వస్తోంది. పాఠ్యపుస్తకాలు, వర్క్ బుక్స్, వర్క్‌షీట్స్, నోట్‌బుక్స్ ఉంటాయి. లంచ్ బాక్స్, నీళ్ల బాటిల్ అన్నీ బ్యాగులో ఉంటాయి.ఇంటి నుంచి బస్సు వరకు బరువుగా ఉండే స్కూల్ బ్యాగు వేసుకుని బస్సు ఎక్కాలి. ఆ టైమ్‌లో భుజాలు నొప్పిగా ఉంటాయి.

ఎం.ఆదిత్య,
6వ తరగతి,వీరఘట్టం

బరువు తగ్గించాల్సిందే



పుస్తకాల బరువు వల్ల పిల్లల్లో అనారోగ్య వాతావరణం కనిపిస్తోంది. బోధన విధానంలో ప్రపంచ వ్యాప్తంగా మార్పులు వస్తున్నాయి.ప్రైవేట్ స్కూళ్లలో అధిక బరువుల మోతను అరికట్టే యంత్రాంగం ఉండాలి. దీనివల్ల జరిగే నష్టంపైన చిన్నారుల మానసిక వ్యథపై ప్రభుత్వాలు స్పందించాలి.

జె.అమర్‌నాథ్, విద్యార్థి తండ్రి, వీరఘట్టం

మానసిక ఉల్లాసం ముఖ్యం



చదువుతో పాటు చిన్నారుల్లో మానసిక ఉల్లాసం పెంచాలి. అప్పుడే వారిలో ఆలోచన శక్తి వస్తుంది. ప్రభుత్వ స్కూళ్లలో తక్కువ పుస్తకాలతో బోధన ఉంటుంది.ప్రైవేట్ స్కూళ్ల ఇష్టానుసారం పుస్తకాలు సిఫార్సు చేస్తున్నాయి.ఇలా చెబితేనే మంచి విద్య అని తల్లిదండ్రులు కూడా నమ్ముతున్నారు.వారి ఆలోచన విధానంలో మార్పు రావాలి.

డాక్టర్ రవీంద్రకుమార్, చిన్నపిల్లల వైద్యనిపుణుడు

ప్రభుత్వ స్థలంలో కూటమి నేత కబ్జా

- అక్రమంగా షెడ్డుల నిర్మాణం
- షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం కోసమని ఆరోపణలు



నరవ జంక్షన్‌లో ప్రభుత్వ స్థలంలో కూటమి నేత నిర్మించిన షెడ్డు

గంట్యాడ: అధికారం ఉందని కూటమి నేతలు రెచ్చిపోతున్నారు. అధికార దర్పంతో ఎక్కడ స్థలం కనబడినా అక్రమిస్తున్నారు. అంతేకాకుండా ఆక్రమించిన స్థలాల్లో నిర్మాణాలు కూడా చేపడుతున్నారు. అధికారులు కూడా అధికార పార్టీ నేతలు ప్రభుత్వ స్థలాలు అక్రమించుకున్నా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్రమణ కళ్లెదుట కనిపిస్తున్నా తమకు ఏమీ కనబడడం లేదన్న విధంగా అధికారులు వ్యవహరిస్తున్నట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో అందులోనూ మంత్రి సొంత మండలంలో తమను ఎవరు ఏమీ అనరనే ధీమాతో కూటమి నేతలు రెచ్చిపోతున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

ఖరీదైన స్థలం కొట్టేసే ప్లాన్..

మండలంలోని నరవ గ్రామం జాతీయ రహదారిని ఆనుకుని ఉంది. దీంతో ఇక్కడ స్థలాలకు రేట్లు ఎక్కువగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో కూటమి నేతలు ప్రభుత్వ స్థలాలపై కన్ను వేశారు. జాతీయ రహదారిని అనుకున్న ప్రభుత్వ స్థలం అక్రమించి ఏకంగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం కోసం షెడ్డు కూడా వేసేశారు. ఈ రోడ్డు గుండానే తహసీల్దార్ నుంచి వీఆర్వో వరకు అందరూ రాకపోకలు సాగిస్తారు. అయినప్పటికీ అక్రమ నిర్మాణం గురించి తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నరనే విమర్శలు ఉన్నాయి. కూటమి నేత అక్రమించిన స్థలం విలువ సుమారు గా రూ. 12 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు ఉంటుంది. దీంతో సదరు నేత సొంత స్థలం మాదిరి షెడ్డులు వేసి షాపులు నిర్మించేసి అద్దెకు ఇచ్చేందుకు ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. కూటమి నేతల మాటలకు చేతలకు పొంతన ఉండడం లేదు. పారదర్శకంగా పాలన సాగిస్తున్నామని మంత్రి దగ్గర నుంచి ఎమ్మెల్యేలు వరకు గొప్పలు చెబుతున్నారు. కానీ అపార్టీ నేతలు ప్రభుత్వ స్థలాలను అక్రమించుకున్నా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

చర్యలు తీసుకుంటాం

ప్రభుత్వ స్థలంలో షెడ్డు నిర్మించినట్టు నా దృష్టికి వచ్చింది. తక్షణమే చర్యలు తీసుకుంటాం.

పి.నీలకంఠేశ్వర రెడ్డి,
తహసీల్దార్, గంట్యాడ

పోలీస్ శాఖ ఔన్నత్యాన్ని ఉన్నతస్థాయికి తీసుకెళ్లాలి

- ఎస్పీ వకుల్ జిందల్



ఎస్పీ వకుల్‌జిందల్‌ను కలిసిన కొత్తగా బాధ్యత తీసుకున్న కానిస్టేబుల్స్

విజయనగరం క్రైమ్: జిల్లాలో హోంగార్డులుగా పనిచేస్తూ ఇటీవల రాష్ట్రస్థాయి పోలీస్ నియామక మండలి వెల్లడించిన ఫలితాల్లో కానిస్టేబుల్స్‌గా ఎంపికైన ఆరుగురు హోంగార్డులు శుక్రవారం ఎస్పీ వకుల్‌జిందల్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సిబ్బందిని ఎస్పీ అభినందిస్తూ పోలీస్‌శాఖలో హోంగార్డుగా పనిచేసిన మీరు సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికైన తరుణంలో శాఖను ఉన్నత స్థాయిలో తీసుకెళ్లేందుకు శక్తివంచన లేకుండా పనిచేయాలని సూచించారు. కానిస్టేబుల్‌గా ఎంపికైన మీపై మరింత బాధ్యత పెరిగిందని, శాఖపట్ల అవగాహన, అనుభవంతో కర్తవ్యదీక్షతో పనిచేయాలని హితవు పలికారు. కానిస్టేబుల్‌గా ఎంపికైన హోంగార్డులు నాగరాజు, ఈశ్వరరావు, గౌరినాయుడు, సత్యనారాయణ, దేవి, గౌరినాయుడులు ఎస్పీని అభినందించి దుశ్శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో హోంగార్డుల ఇన్‌చార్జి ఆర్ఐ రమేష్‌కుమార్, హెచ్‌సీలు శ్రీను, రాజు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో కేసులు ఛేదించాలి

- నేర సమీక్ష సమావేశంలో ఎస్పీ ఎస్వీ మాధవ్ రెడ్డి



నేరసమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ ఎస్వీ మాధవ రెడ్డి

పార్వతీపురం రూరల్: సాంకేతిక పరిజ్ఞానంతో పెండింగ్ కేసుల పరిష్కారం త్వరితగతిన పూర్తిచేయాలని ఎస్పీ ఎస్వీ మాధవ్ రెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ఉన్న పోలీసు అధికారులతో నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేరాల నివారణకు సాంకేతికత వినియోగం, కొత్తక్రిమినల్ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. పోలీసు అధికారులు విధుల్లో నిబద్ధత పాటిస్తూ ప్రతి కేసులో న్యాయపరమైన ఆధారాలు బలపరిచి బాధ్యులకు కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అనంతరం విధుల్లో విశేష ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందికి ఎస్పీ ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సమావేశంలో ఏఎస్పీ అంకితా సురానా, ఏఆర్ డీఎస్పీ థామస్‌రెడ్డి, ఎస్బీ సీఐ రంగనాథం, డీసీఆర్‌బీ సీఐ ఆదాం, సైబర్ సెల్ సీఐ శ్రీనివాసరావు, సీసీఎస్ సీఐ అప్పారావు, ఏఆర్‌ఐలు రాంబాబు, నాయుడు, జిల్లాలో ఉన్న సీఐలు, ఎస్సైలు, జీఆర్‌పీ ఎస్సైలు, ఎక్సైజ్ సీఐలు తదితరులు పాల్గొన్నారు.

తోటపల్లి కాలువలో జారి పడి వ్యక్తి మృతి



తోటపల్లి కాలువలో జారిపడి మృతి చెందిన జమ్మల శంకరరావు

తెర్లాం: తోటపల్లి ప్రధాన కుడికాలువలో ప్రమాదవశాత్తు కాలుజారి పడిపోయిన ఓ వ్యక్తి మృతి చెందాడు. తెర్లాం మండలంలోని కవిరాయునివలస గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం జరిగిన ఈ సంఘటనపై గ్రామస్తులు, తెర్లాం ఎస్సై బి.సాగర్‌బాబు తెలిపిన వివరాలి లా ఉన్నాయి. సింగిరెడ్డివలస గ్రామానికి చెందిన జమ్మల శంకరరావు(50) శుక్రవారం మధ్యాహ్నం 3గంటల సమయంలో తోటపల్లి ప్రధాన కుడికాలువ పక్కకు బహిర్భూమికి వెళ్లాడు. కాలువలో దిగి పైకి ఎక్కుతున్న సమయంలో కాలుజారి నీటిలో పడిపోయాడు. చుట్టుపక్కల ఎవరూ లేకపోవడంతో నీటిలో మునిపోయాడు. కొద్దిసేపటికి గ్రామస్తులు పొలం పనులకు తోటపల్లి కాలువ వైపు వెళ్తూ నీటిలో పడిపోయి ఉన్న వ్యక్తిని చూసి వెంటనే బయటకు తీసి పడిపోయిన వ్యక్తి తమ గ్రామానికి చెందిన జమ్మల శంకరరావుగా గుర్తించారు. అప్పటికే శంకరరావు మృతి చెందడంతో బంధువులు, గ్రామస్తులకు, తెర్లాం పోలీసులకు సమాచారం ఇచ్చారు. కాలువలో పడి వ్యక్తి మృతిచెందిన విషయాన్ని తెలుసుకున్న తెర్లాం ఎస్సై సిబ్బందితో సహా సంఘటనా స్థలానికి వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. ఈ విషయం తెలుసుకున్న తహసీల్దార్ జి.హేమంత్‌కుమార్ వెంటనే సంఘటనా స్థలానికి వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. మృతుడికి భార్య అప్పమ్మ, ఇద్దరు వివాహితులైన పిల్లలు ఉన్నారు. వారు ముగ్గురు చెన్నైకి కూలిపనుల నిమిత్తం వెళ్లి ప్రస్తుతం అక్కడే ఉన్నారు. మృతదేహానికి బంధువులు, గ్రామ పెద్దల సమక్షంలో శవ పంచనామా చేసి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని బాడంగి సీహెచ్‌సీకి తరలించారు. బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై సాగర్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


పాముకాటుతో మహిళ..



అమ్మడు మృతదేహం

సంతకవిటి: మండలంలోని మల్లయ్యపేట గ్రామానికి చెందిన మూల అమ్మడు (49) పాము కాటుకు గురై మరణించినట్లు ఎస్సై ఆర్.గోపాలరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం బుధవారం ఉదయం ఎప్పటిలాగానే అమ్మడు భర్త వెంకటరావుతో కలిసి వ్యవసాయ పనుల నిమిత్తం పొలానికి వెళ్లగా పొలంలో ఆమెను పాము కాటు వేయడంతో శ్రీకాకుళంలోని ఓ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మరణించింది. ఈ ఘటనపై మృతురాలి భర్త వెంకటరావు శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించామని ఎస్సై తెలిపారు.


చెరువులో పడి వ్యక్తి ఆత్మహత్య?



చెరువులో గాలిస్తున్న ఈతగాళ్లు

బొబ్బిలిరూరల్: మండలంలోని ఎం.బూర్జివలస గ్రామ సమీపంలోని చెరువులో గుర్తు తెలియని వ్యక్తి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు పోలీసులు చెరువులో గాలింపు చేపట్టారు. గ్రామానికి చెందిన సన్యాసమ్మ అనే మహిళ అదే దారిలో వెళ్తుండగా కొంత దూరంలో ఎవరో చెరువులో దూకినట్లు కనిపించిందని స్థానికులకు తెలియజేయడంతో స్థానికు సమాచారంతో ఎస్సై రమేష్ తన బృందంతో వచ్చి గాలింపు చేపట్టారు. ఈతగాళ్లను చెరువులో దింపి గాలింపు చేపట్టినప్పటికీ ఎవరి మృతదేహం లభ్యం కాలేదు.దీంతో నిజంగా జరిగిందా? లేక అపోహ? అన్న కోణంలో పోలీసులు స్థానికులను విచారణ చేశారు. చూసిన మహిళ వృద్ధురాలు కావడంతో నీటి బాతులను చూసి చెప్పి ఉంటుందని కొంతమంది, నిజంగా జరిగితే పరిస్థితి ఏమిటని మరి కొందరు అభిప్రాయాలు వ్యక్తం చేయడంతో శుక్రవారం సాయంత్రం వరకు గాలింపు కొనసాగుతునే ఉంది. చెరువులో ఎటువంటి అచూకీ లభ్యం కాలేదని ఎస్సై రమేష్ తెలిపారు.

విజయనగరంలో మరో వ్యక్తి..



ఆత్మహత్యకు పాల్పడిన శంకరరావు

విజయనగరం క్రైమ్: విజయనగరం వన్‌టౌన్ స్టేషన్ పరిధి రంగిరీజువీధికి చెందిన తాడి శంకరరావు(68) ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు వన్‌టౌన్ సీఐ చౌదరి శుక్రవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శంకరరావు ఆత్మహత్యకు పాల్పడినట్లు ఆయన కొడుకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. భర్త శంకరరావు ఆత్మహత్యపై భార్య ఆరోపణలు చేయగా పూర్తిస్థాయిలో విచారణ జరుపుతున్నామని సీఐ తెలిపారు.

వారంలోగా గుంతలకు మరమ్మతులు

- ఆర్‌అండ్‌బీ ఏఈఈ బి.రాజేంద్ర కుమార్
- సాక్షి కథనానికి స్పందన

పార్వతీపురం రూరల్: జిల్లా కేంద్రం నుంచి కొరాపుట్ వైపు వెళ్లేందుకు ఉన్న అంతర్‌రాష్ట్ర రహదారిపై గుంతలకు వారంలోగా మరమ్మతులు చేపడతామని ఆర్‌అండ్‌బీ ఏఈఈ బి. రాజేంద్రకుమార్ అన్నారు. ఈనెల 19న సాక్షి దినపత్రికలో ప్రచురితమైన ''చెరువులను తలపిస్తున్న రోడ్లు'' అనే శీర్షికకు ఆయన స్పందిస్తూ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ రహదారి విస్తీర్ణం నిమిత్తం రూ.17కోట్లు మంజూరవగా అందులో భాగంగా 4/0 కిలోమీటర్ల నుంచి 12/8 కిలోమీటర్ల వరకు విస్తీర్ణ పనులు పూర్తయ్యాయన్నారు. అయితే 2023 నుంచి బిల్లులు చెల్లింపు నిలిచిపోయాయని, ఇటీవల బకాయి బిల్లులు చెల్లింపులు జరగడంతో త్వరలో పనులు ప్రారంభించి పూర్తిచేస్తామని స్పష్టం చేశారు.

పోలయ్య ఆచూకీ లభ్యం



ఉరదండ పోలయ్య(ఫైల్)

సంతకవిటి: మండలంలోని చిత్తారపురం పంచాయతీ పోడలి గ్రామానికి చెందిన ఉరదండ పోలయ్య(76) గత ఆదివారం ఉదయం నాగావళి నదిలో గల్లంతయ్యాడు. పోలయ్య ఆచూకీ లభించకపోవడంతో గత మంగళవారం నుంచి ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు నదిలో గాలింపు చేపట్టగా శుక్రవారం సాయంత్రం శ్రీకాకుళం జిల్లా పొందూరు మండలం పెద్ద బొడ్డేపల్లి వద్ద ఓ మృతదేహం ఒడ్డుకు రావడంతో స్థానికులు అక్కడి వీఆర్‌ఓకు సమాచారం అందించారు. ఈ సమాచారం అందుకున్న పోలయ్య కుటుంబసభ్యులు వెళ్లి మృతదేహం పోలయ్యదేనని గుర్తించినట్లు వీఆర్‌ఓ అన్నారావు, పోలీస్ సిబ్బంది తెలిపారు.

వైభవంగా శ్రావణమాస పూజలు

- ప్రత్యేక పుష్పాలంకరణలో మహాలక్ష్మి
- అమ్మవారి సన్నిధిలో శతసహస్ర నామ కుంకుమార్చన



పుష్పాలంకరణలో శ్రీ మహాలక్ష్మి అమ్మవారు



అమ్మవారికి శత సహస్రనామ కుంకుమార్చన జరిపిస్తున్న వేద పండితులు

నెల్లిమర్ల రూరల్: శ్రావణమాసం చివరి శుక్రవారం సందర్భంగా జిల్లాలో అతి పెద్ద పుణ్యక్షేత్రమైన రామతీర్థంలోని శ్రీ సీతారామ స్వామి దేవస్థానం భక్తులతో కిటకిటలాడింది. ఆలయంలో కొలువైన శ్రీ మహాలక్ష్మి అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో అర్చకులు సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. వేకువజామునే రామస్వామికి ప్రాతఃకాలార్చన, బాలభోగం నిర్వహించిన తరువాత యాగశాలలో సుందరకాండ హవనం, స్వామివారి నిత్య కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా జరిపించారు. అనంతరం ఉపాలయంలో శ్రీ మహాలక్ష్మి అమ్మవారికి పాలు, పెరుగు, తేనె, నెయ్యి, వివిధ రకాల ఫల రసాలు, గంధంతో అభిషేకాలు జరిపించారు. సుమారు 30 మంది వైష్ణవ ఋత్విక్కులతో శత సహస్రనామ కుంకుమార్చన వైభవంగా జరిపించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ క్షేత్ర పాలకుడైన శ్రీ ఉమా సదాశివాలయంలో కామాక్షి అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి. కార్యక్రమంలో ఈఓ వై.శ్రీనివాసరావు, అర్చకులు సాయిరామాచార్యులు, నరసింహాచార్యులు, మల్లికార్జున శర్మ, కిరణ్, పవన్, రామగోపాలాచార్యులు పాల్గొన్నారు.

మహిళా ముద్దాయికి యావజ్జీవ శిక్ష

- భర్త, కూతురి హత్య



విజయనగరం క్రైమ్: విజయనగరం టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 2015లో నమోదైన జంటహత్యల కేసులో భీమిలి మండలం నగరపాలెం ప్రాతానికి చెందిన జ్యోతిర్మయి (34)కి జీవిత ఖైదు, దిబ్బలపాలెం గ్రామానికి చెందిన పాడ రాము (38), చొక్కా నరేష్ (42), ఉప్పాడ గ్రామానికి చెందిన మరో ఇద్దరు ముద్దాయిలకు ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ విజయనగరం ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయమూర్తి అప్పలస్వామి తీర్పు ఇచ్చారని ఎస్పీ వకుల్ జిందల్ శుక్రవారం తెలిపారు. కేసు వివరాల్లోకి వెళ్తే..భీమిలికి చెందిన జ్యోతిర్మయికి నగరపాలెం గ్రామానికి చెందిన రమేష్‌తో వివాహం జరగ్గా వారికి ఇద్దరు కూతుర్లు, ఒక కొడుకు ఉన్నారు. అయితే దిబ్బవాని పాలెం గ్రామానికి చెందిన పాడ రాముతో జ్యోతిర్మయి వివాహేతర సంబంధం పెట్టుకుంది. భర్త రమేష్ చెన్నైలో సీ మన్‌గా ఉద్యోగం చేస్తూ తిరిగి వచ్చే క్రమంలో భార్య వివాహేతర సంబంధం బయటపడింది. ఈ విషయంపై భర్త ప్రశ్నించినందుకు ప్రియుడు, అతని స్నేహితులతో కలిసి భర్తను జ్యోతిర్మయి హతమార్చి మృతదేహాన్ని భీమిలి సముద్రంలో పడేసింది. ఆ సమయంలో ఆరేళ్ల కూతురు ఇంట్లో జరిగిన దారుణాన్ని చూడడంతో చిన్నారిని కూడా పకడ్బందీగా విజయనగరం తీసుకొచ్చి కొత్తపేట బావిలో పడేసింది. 2015 జూలై 26 ఈ ఘటన జరగడంతో అప్పటి టూ టౌన్ సీఐ అంబేడ్కర్ కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు విచారణలో భాగంగా టూ టౌన్ సీఐ ప్రాసిక్యూషన్ పూర్తి చేసి అభియోగ పత్రాలను కోర్టులో దాఖలు చేయడంతో కోర్టు విచారణలో నేరం రుజువు కావడంతో ముద్దాయిలకు పైవిధంగా కోర్టు శిక్ష విధించింది. ఈ కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ రఘురామ్, సీఐ శ్రీనివాసరావు, కోర్టు కానిస్టేబుల్ లక్ష్మి, ఏఎస్సై మల్లేశ్వరరావులు క్రియాశీలకంగా పనిచేశారని ఎస్పీ తెలిపారు.

అనాథలైన అమ్మానాన్నలు

- పుట్టిన గ్రామంలోనే భిక్షాటన చేసుకుంటూ జీవనం
- లక్షల విలువైన ఆస్తులను దక్కించుకుని తల్లిదండ్రులను రోడ్డున పడేసిన పిల్లలు



అనాథలా ప్లాస్టిక్ బాటిల్స్‌ను ఏరుకుంటూ జీవనం సాగిస్తున్న చిన్నమ్మలు

లక్కవరపుకోట: అడ్డాల నాడు బిడ్డలు కానీ గడ్డాల నాడు బిడ్డలా? అన్నట్లు తయారైంది వృద్ధులైన ఆ దంపతుల పరిస్థితి. ఇద్దరు కూతుళ్లు, ఇద్దరు కొడుకులు ఉన్నా అనాథల్లా రోడ్ల వెంబడి పిచ్చివారిలా తిరుగుతూ ఏవరైనా పెట్టింది తింటూ షాపుల ముందు పడుకుంటూ ఆ దంపతులు పడుతున్న దీనస్థితి కలిచివేస్తోంది. నలుగురు పిల్లలను కని పెంచి ప్రయోజకులుగా చేసిన ఆ తల్లిదండ్రులు అనాథల్లా మిగిలిపోయారు. ఈ దీనగాథ ఇలా ఉంది. లక్కవరపుకోట మండల కేంద్రానికి చెందిన సంఘం అప్పలనారాయణ, చిన్నమ్మలు భార్యాభర్తలు. వారికి ఇద్దరు ఆడపిల్లలు, ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. కాయగూరల వ్యాపారం చేస్తూ పిల్లలను పెంచి వారికి పెళ్లిళ్లు, పేరంటాలు జరిపించారు. అలాగే చిన్నమ్మలుకు తన కన్నవారి కుటుంబం నుంచి కొంత ఆస్తికూడా కలిసి వచ్చింది. ఇద్దరు ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేయగా వారు అత్తవారిళ్లకు వెళ్లిపోయారు. కొడుకులిద్దరూ తన తల్లి కన్న వారి ఇంటి నుంచి వచ్చిన భూమిని లక్షల్లో అమ్ముకుని సొమ్ము చేసుకున్నారు. తీరా ప్రస్తుతం ఆదంపతులు వృద్ధాప్యంలోకి చేరడంతో వారి ఆలనా పాలన పట్టించుకోవడం మానేశారు. దీంతో ఆ దంపతులు మతిస్థిమితం లేక ఇద్దరూ చెరో దారిలో పడి రోడ్లపై తిరుగుతూ భిక్షాటన చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు..రి

విద్యాసంస్కరణల అమలుతో వికసిత్‌భారత్

- ఏబీఆర్ఎస్ఎం జాతీయ సంయుక్త వ్యవస్థాపక కార్యదర్శి జి.లక్ష్మీస్

విజయనగరం అర్బన్: నవ భారత్ నిర్మాణానికి జాతీయ విద్యా విధానం -2020 సంస్కరణల అమలు కీలకమని అఖిల భారత రాష్ట్రీయ శిక్షక్ మహాసంఘ్ (ఏబీఆర్ఎస్ఎం) జాతీయ సంయుక్త వ్యవస్థాపక కార్యదర్శి గుంథ లక్ష్మీస్ అన్నారు. కేంద్రీయ గిరిజన యూనివర్సిటీలో 'హమారా సంవిధాన్-హమారా స్వాభిమాన్-వికసిత్ భారత్ కోసం జాతీయ విద్యా విధానం-2020 ఆత్మలా ఉంది' అనే అంశంపై శుక్రవారం జరిగిన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. రాజ్యాంగ విలువలు, సాంస్కృతిక గౌరవం, విద్యా సంస్కరణలు వంటి చర్యల అమలు వికసిత్ భారత్ నిర్మాణానికి కీలకమన్నారు. వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ టి.శ్రీనివాసన్ మాట్లాడుతూ నూతన విద్యావిధానం అమలుతో విద్యా నైపుణ్యాలు మెరుగుపడతాయన్నారు. అనంతరం ముఖ్య అతిథిని సత్కరించారు. కార్యక్రమంలో వర్సిటీ ఏబీఆర్ఎస్ఎం అధ్యక్షురాలు డాక్టర్ పరికిపాండ్ల శ్రీదేవి, వర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జితేంద్రమోహన్ మిశ్రా, వివిధ విభాగాల అధ్యాపకులు ప్రేమా చటర్జీ, బి.కోటయ్య, కె.సురేష్‌బాబు, బి.వెంకటేశ్వర్లు, ఎం.గంగునాయుడు, పి.కిశోర్ తదితరులు పాల్గొన్నారు.